సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం, 26, సెప్టెంబర్, 2023



సంఘం శరణం గచ్ఛామి

వేములవాడ: అంబేడ్కర్ జీవిత చరిత్రపై హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ 'సంఘం శరణం గచ్ఛామి' నాటకాన్ని సోమవారం ప్రదర్శించారు.



అన్నదానానికి రూ.లక్ష విరాళం

వేములవాడ: రాజన్న అన్నదాన సత్రానికి హైదరాబాద్‌కు చెందిన సూరపాటి విష్ణురెడ్డి -మౌనికరెడ్డి దంపతులు రూ.లక్ష విరాళం సోమవారం అందజేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గరిపెల్లి అశోక్‌కు బాలసాహిత్య పురస్కారం



అశోక్

ముస్తాబాద్(సిరిసిల్ల): డాక్టర్ వేదగిరి రాంబాబు బాలసాహిత్య పురస్కారానికి ముస్తాబాద్‌కు చెందిన బాలసాహితీవేత్త, కవి, విమర్శకులు గరిపెల్లి అశోక్ ఎంపికయ్యారు. బాలసాహిత్యంలో కృషిచేసిన వారికి ఐదేళ్లుగా పురస్కారాలు అందిస్తున్నట్లు పురస్కార కమిటీ కన్వీనర్ సింహప్రసాద్, కమిటీ సభ్యులు పత్తిపాక మోహన్, వాణిశ్రీ తెలిపారు. గరిపెల్లి అశోక్ వందలాది బాలసాహితీ వర్క్‌షాప్‌లు నిర్వహించి.. బాలల కథా సంకలాలను వెలువరించారని కొనియాడారు. అక్టోబర్ 10న రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు.

సీతారాం కథలపై పరిశోధన చేయాలి



గూడూరి సీతారాం వర్ధంతి సభలో మాట్లాడుతున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ తొలితరం కథారచయిత గూడూరి సీతారాం వర్ధంతిని సోమవారం జిల్లా కేంద్రంలోని మానేరు రచయితల సంఘం అక్షర చైతన్య గ్రంథాలయంలో నిర్వహించారు. పవర్‌లూమ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ తెలంగాణ భాషకు, యాసకు సాహిత్య హోదా కల్పించిన కవుల్లో అగ్రగణ్యుడు అని కొనియాడారు. సీతారాం సాహిత్యాన్ని పూర్తి స్థాయిలో వెలికితీసి పరిశోధించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ కవి జూకంటి జగన్నాథం, మానేరు రచయితల సంఘం ప్రతినిధులు ఎలగొండ రవి, ఆడెపు లక్ష్మణ్, బూర దేవానందం, చిటికెన కిరణ్, మోత్కుల నారాయణ, పోకల సాయి, లెక్చరర్లు దీపిక, అర్జున్ పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన



పరిశీలిస్తున్న తోట ఆగయ్య, శ్రీధర్‌పంతులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలో మంత్రి కేటీఆర్ ఈనెల 27న పర్యటించనున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఏర్పాట్లు పరిశీలించారు. గంభీరావుపేట, లింగన్నపేట, నర్మాల, కోళ్లమద్ది గ్రామాల్లోని లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందజేయనున్నారు. మండలకేంద్రంలో బహిరంగసభలో పాల్గొననున్నారు. ఈ ఏర్పాట్లను సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, సెస్ మండల డైరెక్టర్ నారాయణరావు, పార్టీ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, పట్టణాధ్యక్షుడు పెద్దవేని వెంకటియాదవ్, ఏఎంసీ చైర్మన్ హన్మంతరెడ్డి, వైస్‌చైర్మన్ లింగంయాదవ్, నాయకులు లక్ష్మణ్, సురేందర్‌రెడ్డి, దయాకర్‌రావు, రాజారాం పరిశీలించారు.

చందుర్తి పీహెచ్‌సీ తనిఖీ



చందుర్తి(వేములవాడ): చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి సుమన్ మోహన్‌రావు సోమవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది పనితీరు పరిశీలించారు. రికార్డులను, హాజరుపట్టికను పరిశీలించి, మందుల రిజిస్టార్‌ను పరిశీలించారు. జ్వరాలు ఎక్కువగా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డాక్టర్ సంపత్‌ను ఆదేశించారు.

ఐఆర్ ప్రకటించాలి

బోయినపల్లి(చొప్పదండి): ప్రభుత్వం పీఆర్సీ కమిటీ వేసి, వెంటనే ఐఆర్ ప్రకటించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రఘునాథ్‌రెడ్డి, మాజీ కార్యదర్శి పంజాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సమస్యల సేకరణలో భాగంగా సోమవారం మండలంలోని వెంకట్రావుపల్లి, మాన్వాడ, బోయినపల్లి, స్తంభంపల్లి, కోరెం పాఠశాలలను, స్థానిక కేజీబీవీని సందర్శించారు. వారు మాట్లాడుతూ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు. కేజీబీవీల్లో వార్డెన్, వాచ్‌మెన్లను నియమించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా కౌన్సిలర్లు కట్ట వెంకటహనుమాన్, మాదిరెడ్డి రాజిరెడ్డి, చాడ నరోత్తంరెడ్డి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కొత్తూరి శ్రీధర్, బందారు కుమారస్వామి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం.. అనేక సవాళ్లు!

- వచ్చేనెల 24 నుంచి సర్కారు బడుల్లో టిఫిన్
- ఆరు రకాలతో విడుదలైన ప్రతిపాదిత మెనూ
- మానవ వనరులు, మౌలిక సదుపాయాలు పెరిగేనా?
- మిడ్ డే మీల్స్ సిబ్బందికి పెరుగనున్న పనిగంటలు
- నిరంతర నిధులు అందాలంటున్న తల్లిదండ్రులు



ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	సర్కారు బడులు	విద్యార్థులు	వినియోగం	మిడ్‌డే స్టాఫ్
కరీంనగర్	652	49,754	44,502	1,134
పెద్దపల్లి	554	34,021	34,021	921
జగిత్యాల	783	77,050	72,050	1,475
సిరిసిల్ల	478	50,328	41,328	863
మొత్తం	2,467	2,11,153	1,91,901	4,393

నోట్: ఈ గణాంకాలలో స్వల్ప వ్యత్యాసాలు ఉండొచ్చు.

సాక్షిప్రతినిధి,కరీంనగర్: విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదపడేందుకు ఉద్దేశించిన అల్పాహారం పథకం అక్టోబర్ 24 నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం పూట విద్యార్థులకు అందించే ప్రతిపాదిత మెనూ విడుదలైంది. విద్యార్థుల శారీరక శ్రేయస్సు, పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం అమలు చేయనున్న ఈ పథకం ముందు కొన్ని సవాళ్లు ఉన్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలో ఈ పథకం అమలవుతున్నా 2,400లకు పైగా పాఠశాలల్లో సిబ్బందికి పాత బకాయిలు, వేతన సవరణ, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్లు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. అదే సమయంలో ఇదే ప్రస్తుత సిబ్బంది, మౌలిక సదుపాయాలు పిల్లలకు అల్పాహారం పెట్టేందుకు సరిపోతాయా? అంటే.. చాలవంటూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. అల్పాహారం అమలు నేపథ్యంలో మిడ్‌డే మీల్స్ సిబ్బందికి పనిగంటలు, వంట సమయం పెరుగుతాయని దీన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని వారికి సకాలంలో నిధులు విడుదల చేయాలని సూచిస్తున్నారు. ఒకవేళ మానవ వనరుల పెంపు సాధ్యం కాకపోయినా.. వారికి నిధుల విషయంలో లోటు రాకుండా చూసుకోవాలంటున్నారు.

రెండు లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ పథకం అమలైతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే దాదాపు రెండు లక్షలకుపైగా విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. విద్యార్థుల్లో పోషకాల కొరత నివారించడానికి ఉద్దేశించిన ఈ పథకంలో భాగంగా సోమవారం నుంచి శనివారం వరకు మినరల్స్, ప్రొటీన్లను సమతూకం చేసేందుకు ప్రత్యేకమైన మెనూను అనుసరించనున్నారు. అదే సమయంలో ఉమ్మడి జిల్లాలో పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం కోసం శ్రమిస్తోన్న సిబ్బందికి ఇకపై డబుల్ డ్యూటీలు అవనున్నాయి. గతంలో వీరంతా ఉదయమే వచ్చి, భోజనం కోసం కూరగాయలు, బియ్యం సిద్ధం చేసుకుని, మధ్యాహ్నం వేళకు అంతా సిద్ధం చేసేవారు. ఇప్పుడు ఉదయం 9 గంటలకల్లా సిబ్బంది, విద్యార్థులకు అల్పాహారం సిద్ధం చేయాలంటే.. తెల్లవారక ముందే 5 గంటలకే పాఠశాలకు చేరి పని మొదలు పెట్టాల్సి ఉంటుంది. ఈ లెక్కన సమయానికి విద్యార్థులకు అల్పాహారం అందాలంటే ఇప్పుడున్న మానవ వనరులు, నిధులు పెరగాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసరాలు, కోడిగుడ్ల ధరలకు ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలకు వ్యత్యాసం ఉంటోంది. అందుకే ఈ వ్యత్యాసాలు తగ్గించి మిడ్ డే మీల్స్ సిబ్బందిపై ఆర్థిక భారం తగ్గించాలని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వారికి వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలు కల్పిస్తే మరింత ప్రోత్సాహకరంగా ఉంటుందని సూచిస్తున్నారు.

ప్లేటుకు ఎంత?

ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతోన్న మిడ్ డే మీల్స్ కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తోంది. తరగతులను బట్టి ప్లేటుకు ఇంత అని నిర్ణయించింది. అవి ఇలా ఉన్నాయి? ఒకటి నుంచి 5వ తరగతి వరకు రూ.5.45 , 5 నుంచి 8వ తరగతి వరకు రూ.8.17, 9 నుంచి 10వ తరగతి వరకు రూ.10.19 చొప్పున చెల్లిస్తోంది. 1 నుంచి 8వ తరగతి వరకు గుడ్డు కోసం రూ.5 చెల్లిస్తోంది. కొత్త కరీంనగర్ జిల్లాలో ఏటా రూ.7.6 కోట్ల మధ్యాహ్న భోజనం కోసం ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ లెక్కన నెలకు రూ.63.48 లక్షల వరకు ఖర్చవుతోంది. జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్లలో కాస్త అటూ ఇటూగా ఇంతే మొత్తం ఖర్చవుతుందని అంచనా. ఈ లెక్కన పాత జిల్లాలో దాదాపు రూ.50 కోట్ల వరకు మిడ్ మీల్స్ కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఇక అల్పాహారం మొదలైతే.. ఇందులో కనీసం నాలుగో వంతైనా ఖర్చు చేయాల్సి వస్తుంది.

ప్రతిపాదించిన మెనూ ఇదే..

- సోమవారం: గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ
- మంగళవారం: బియ్యం రవ్వ కిచిడి, చట్నీ
- బుధవారం: బొంబాయి రవ్వ ఉప్మా, సాంబార్
- గురువారం: రవ్వ పొంగల్, సాంబార్
- శుక్రవారం: మిల్లెట్ రవ్వ కిచిడి, సాంబార్
- శనివారం: గోధుమ రవ్వ కిచిడి, సాంబార్

పేద విద్యార్థులకు వరం



ప్రభుత్వం చేపట్టిన అల్పాహార పథకాన్ని ఆహ్వానిస్తున్నాం. ఆహారం తీసుకోకుండా బడికి వస్తున్న నిరుపేద విద్యార్థులకు ఈ పథకం వరం. ప్రస్తుతం పౌష్టికాహారం లోపంతో ప్రార్థన సమయంలోనే చాలా మంది పిల్లలు కిందపడిపోతున్నారు. ఈ పథకం అమలైతే ఇలాంటి బాధలుండవు. పథకాన్ని ప్రభుత్వం చిత్తశుద్ధితోని అమలు చేస్తూ నిరంతరం నిధులు విడుదల చేయాలి. మానవ వనరులు, మౌలిక సదుపాయాలు పెంచాలి.

– శనిగరపు రవి, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రాస్తారోకోలు.. దీక్షలు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సోమవారం ధర్నాలు.. రాస్తారోకోలు.. నిరసనలతో దద్దరిల్లింది. స్థానిక అంబేడ్కర్‌చౌరస్తా, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముందు, కలెక్టరేట్ వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆందోళనలు, నిరసనలు ఉధృతంగా కొనసాగాయి. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

ఎమ్మెల్యే ఆఫీస్ ముట్టడి ఉద్రిక్తం



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముట్టడి ఉద్రిక్తమైంది. నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వందలాది సంఖ్యలో తరలివచ్చారు. క్యాంపు ఆఫీస్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇరువర్గాల తోపులాటలతో ఉద్రిక్తంగా మారింది. ఓ మహిళ ఎస్సై కావాలనే తనను గాయపరిచిందని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు ఆగ్రహం వ్యక్తం చేసింది. సదరు ఎస్సై క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, టౌన్ సీఐ ఉపేందర్ ఆందోళనకారులతో మాట్లాడి శాంతింపజేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, అంగన్‌వాడీ జేఏసీ జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, కొండికొప్పుల పద్మ, శ్యామల పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డు రద్దు చేయాలి

టీఎస్‌పీఎస్సీ పాలకవర్గాన్ని రద్దు చేయాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామిగౌడ్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ తప్పిదాలకు నైతిక బాధ్యత వహించి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు అంకని భాను, ఎనగందుల వెంకన్న, నాయకులు గుగులోతు చంద్రు నాయక్, బొడ్డు మహేందర్, రాజబాబు, మధుకర్, నరేశ్ పాల్గొన్నారు.

ఆశవర్కర్ల మానవహారం



పనికి తగిన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం నెలకు రూ.18వేలు అందించాలని కోరుతూ ఆశవర్కర్లు సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మానవహారం చేపట్టారు. సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగినట్లు వెల్లడించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఆశవర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేణి మంజుల, ప్రధాన కార్యదర్శి జయశీల, చంద్రకళ, లత, రాణి, లావణ్య ఉన్నారు.

పర్మినెంట్ చేయండి



తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇన్నాళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్న తమను పట్టించుకున్న వారు లేరన్నారు. డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మీస లక్ష్మణ్, లక్ష్మి, సత్తయ్య, సావిత్రి, మల్లవ్వ, నర్సయ్య, మంజుల, రేణుక, కనకలక్ష్మి పాల్గొన్నారు.

భక్తిభావంతో నిమజ్జనం చేసుకోవాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



గుడిచెరువు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

వేములవాడ: వినాయక నిమజ్జనోత్సవం భక్తిభావంతో జరుపుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. రాజన్న గుడి చెరువులో చేస్తున్న నిమజ్జనోత్సవ ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి శ్రీనివాస్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంటి మహేశ్, నాయకులు కోల కృష్ణస్వామి, అన్నారం శ్రీనివాస్, గడ్డమీద శ్రీనివాస్, పిన్నింటి హన్మండ్లు, రామతీర్థపు హరీశ్, నామాల శేఖర్, సగ్గు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి భారీ బందోబస్తు



నిమజ్జన ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- 27న వేములవాడలో..
- 28న సిరిసిల్లలో ఉత్సవాలు
- జిల్లా ప్రజలు సహకరించాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లాలో ఏర్పాటు చేసిన వినాయకుల నిమజ్జనానికి ఏర్పాట్లు కొనసాగుతున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. వేములవాడలో ఈనెల 27, సిరిసిల్లలో 28న నిమజ్జనోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వేములవాడలోని గణనాథుల విగ్రహాలను గుడిచెరువులో నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. గణేశ్ శోభాయాత్ర మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించి రాత్రి 12 గంటల్లోపు పూర్తయ్యేలా భక్తులు సహకరించాలని కోరారు. గణేశ్ శోభాయాత్ర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దాదాపు 150 మందికిపైగా పోలీసు అధికారులు, సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. వేములవాడ డీఎస్పీ, సీఐల నేతృత్వంలో ఈ శోభాయాత్ర సాగుతుందని వివరించారు. వేములవాడలో 1,947 గణనాథుని విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సిరిసిల్లలో...

సిరిసిల్లలో 1,125 విఘ్నేశ్వర ప్రతిమలు ఏర్పాటు చేశారని, శోభాయాత్రకు సిరిసిల్ల సబ్‌డివిజన్‌లోని దాదాపు 200 మంది పోలీసు అధికారులతోపాటు, సిబ్బంది విధుల్లో ఉంటారని వివరించారు. ఇంకా అదనంగా అవసరం ఏర్పడితే వేములవాడ సబ్‌డివిజన్‌లోని పోలీస్ సిబ్బందిని వినియోగించుకుంటామని తెలిపారు. మానేరువాగులో నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. డివిజన్ పరిధిలోని గ్రామాల్లో చెరువులు, కుంటల్లో నిమజ్జన ఏర్పాట్లు సంబంధిత స్టేషన్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు.

పెద్ద స్పీకర్ ఒకటి... చిన్న స్పీకర్లు రెండు

నిమజ్జనం పేరిట ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా డీజేలు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. మండప నిర్వాహకులతో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. డీజేలకు అనుమతి లేదని, ఒక మండప నిర్వాహకులకు ఒక పెద్ద స్పీకర్, లేనిపక్షంలో రెండు చిన్న స్పీకర్స్ అమర్చుకునేందుకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. గణేశుని నిమజ్జనం, ముస్లింల పండుగ ఒకే రోజు రావడంతో మతపెద్దలతో మాట్లాడామని, ముస్లింల పండుగను జిల్లాలో అక్టోబర్ 1న నిర్వహించుకోవడానికి ఒప్పుకున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆయాజ్, సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్, టౌన్ ప్లానింగ్ అధికారి అన్సారీ పాల్గొన్నారు.

రైల్వేలైన్ భూ సేకరణ పూర్తి చేస్తాం

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- కేంద్ర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ పెండింగ్ భూ సేకరణను త్వరగా పూర్తి చేస్తామని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. కేంద్ర క్యాబినెట్ సెక్రటేరియట్ సమన్వయ కార్యదర్శి విజన్ తివాన్‌తో సోమవారం ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ ఆఫీస్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రైల్వేలైన్‌కు సంబంధించిన భూసేకరణ పురోగతిపై కేంద్ర అధికారులు ఆరా తీశారు. జిల్లాకు సంబంధించి సుమారు 945 ఎకరాలు సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 808 ఎకరాలు సేకరించి, రైల్వేశాఖకు అప్పగించినట్లు వివరించారు. మిగతా 144 ఎకరాల సేకరణ త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఆర్డీవో ఆనంద్‌కుమార్, జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ ఉపేందర్‌రావు, పర్యవేక్షకులు రమేశ్, తహసీల్దార్ రాంచందర్ ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

'డబుల్' ఇళ్లను సిద్ధం చేయండి

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండల పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. గంభీరావుపేట, లింగన్నపేటలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ గంభీరావుపేటలోని బీసీకాలనీలో 168, ఎస్సీకాలనీలో 104, లింగన్నపేటలో 50, నర్మాలలో 30, కోళ్లమద్దిలో 17 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించినట్లు తెలిపారు. ఆయా కాలనీల్లో వసతులు కల్పించాలన్నారు. తాగునీటి శాంపిళ్లను సేకరించి పరీక్షించాలని సూచించారు. ఇళ్లకు పేయింటింగ్ వేయాలన్నారు. ఆర్డీవో ఆనంద్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, డీపీవో రవీందర్, డీఏవో భాస్కర్, సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

పటిష్టంగా ఓటరు జాబితా తయారీ చేయాలి

తప్పులకు ఆస్కారం లేకుండా ఓటరు జాబితాను పటిష్టంగా తయారు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2023 రెండో ప్రత్యేక ఓటర్ జాబితా సవరణలో భాగంగా పదిర, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల కేంద్రంలోని డే కేర్ సెంటర్‌ను పరిశీలించారు. ఆర్డీవో ఆనంద్‌కుమార్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, నాయబ్ తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి ఉన్నారు.





రాజన్నకు కోడెమొక్కులు



వేములవాడ: రాజన్నను సోమవారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు స్వామికి కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.30 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయంలోని నాగిరెడ్డి మంటపంలో ఏర్పాటు చేసిన వినాయకునికి స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయంలోని శ్రీలక్ష్మీగణపతికి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో రాత్రి మహాపూజ నిర్వహించారు.

క్లుప్తంగా

కామారెడ్డికి తరలిన ముదిరాజ్‌లు



కామారెడ్డికి వెళ్తున్న ముదిరాజ్‌లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్ గ్రామ ముదిరాజ్‌లు సోమవారం కామారెడ్డిలో నిర్వహించిన ధర్మయుద్ధం ర్యాలీకి తరలివెళ్లారు. వారు మాట్లాడుతూ ముదిరాజ్ జనాభా నిష్పత్తి ప్రకారం ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని కోరారు. ముదిరాజ్‌లకు తగిన న్యాయం జరుగకపోతే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలకు వ్యతిరేకంగా ఉంటామన్నారు. ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు నిమ్మల అశోక్, సంఘం బేడా అధ్యక్షులు నిమ్మల కిషన్, బొమ్మనవేణి నారాయణ, తమ్మవేని సత్యం తదితరులు ఉన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లబొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్‌ను పలు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. నారాయణపూర్ ముదిరాజ్, గౌడ యువసేన సంఘాల ఆధ్వర్యంలో మోహన్‌కుమార్‌ను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎలవేని రాజయ్య, పూదరి సురేశ్, పూదరి నర్సయ్య, మామిండ్ల ముత్తయ్య, జెల్ల సత్తయ్య, లింగాల నర్సయ్య, బొల్గం రాధాకృష్ణ, పాముల శ్రీనివాస్, లింగాల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాణీప్రసాద్‌కు ‘తానా’ ప్రశంసపత్రం



కవితా గానం చేస్తున్న కందేపి రాణీప్రసాద్

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రానికి చెందిన బాలసాహిత్యకారిణి కందేపి రాణీప్రసాద్‌కు ఉత్తర అమెరికా తెలుగు సంఘం ప్రశంసపత్రం బహూకరించింది. నారీ సాహిత్య భేరీ పేరిట ఆన్‌లైన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ శతా ధిక కవయిత్రుల సమ్మేళనంలో రాణీప్రసాద్ పాల్గొని ‘అంతరించిపోతున్న కుటుంబ బంధాల’పై కవితాగానం చేశారు.

పీజీ సెట్ వెబ్ ఆప్షన్‌కు నేడే చివరి అవకాశం

గంభీరావుపేట(సిరిసిల్ల): పీజీ సెట్ రాసిన విద్యార్థులు వెబ్ ఆప్షన్ పెట్టుకునేందుకు, ఎడిటింగ్ ఆప్షన్‌కు మంగళవారం చివరి అవకాశమని గంభీరావుపేట ప్రభుత్వ పీజీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.విజయలక్ష్మి తెలిపారు. కళాశాలలో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంకామ్ జనరల్ కోర్సుల్లో 40 సీట్ల చొప్పున ఉన్నాయని, పరిసర ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా‘వాణి’ వినండి

- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు
- ఫిర్యాదుల స్వీకరించిన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్
- ప్రజావాణికి 40 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అర్జీదారులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి బాధితులు తరలివచ్చారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలు పరిష్కరించాలని 40 మంది బాధితులు వినతిపత్రాలు అందించారు. సమస్యలు పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని, సత్వర న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, ఆర్డీవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

కోతులు దాడి చేస్తున్నాయి



మాది కోనరావుపేట మండలం సుద్దాల. మా ఊరిలో కోతుల బెడద ఎక్కువగా ఉంది. ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఇళ్లలోకి వస్తూ వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు, సుద్దాల ఉపసర్పంచ్

అర్హులకు దళితబంధు ఇవ్వాలి



అర్హులకు దళితబంధు ఇవ్వాలి. ఈ పథకానికి బీఆర్‌ఎస్ నాయకులనే ఎంపిక చేస్తున్నారు. రాజకీయ జోక్యం లేకుండా, కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక చేయాలి. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించాలి.

– అఖిలపక్షం నాయకులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి



గొర్రెలషెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. గొర్రెల షెడ్ల నిర్మాణానికి మా ఊరిలోని సర్వేనంబర్ 545లోని భూమిని యాదవ సంఘానికి కేటాయించారు. కాని అదే గ్రామానికి చెందిన కొందరు షెడ్లను నిర్మించుకోకుండా అడ్డుకుంటున్నారు. దాదాపు 20 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి సాగుచేసుకుంటున్నారు.

– గోపాలరావుపల్లె యాదవులు

‘డబుల్’ ఇళ్లు మంజూరు చేయాలి



మాది సిరిసిల్ల మున్సిపల్ పరిధి 9వ వార్డు తుర్కాశీనగర్. కొన్నేళ్లుగా పూరిగుడిసెల్లో ఉంటున్నాం. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఎంపిక చేయగా.. డ్రాలో పేర్లు కూడా వచ్చాయి. కానీ ఇప్పుడు ఇల్లు రాలేదని అధికారులు చెబుతున్నారు. అర్హత ఉన్న కూడా పేరును తొలగించారు. మాకు న్యాయం చేయాలి.

– తుర్కాశీనగర్ వాసులు

పేదింటి బిడ్డకు పెద్ద కష్టం

- కాలేయ వ్యాధితో మంచం పట్టిన శిరీష
- ఆపరేషన్‌కు రూ.2లక్షలు అవసరం
- ఆపన్నహస్తం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపు



తల్లిదండ్రులతో చిన్నారి శిరీష

ముస్తాబాద్(సిరిసిల్ల): రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబం. నిలువ నీడలేని ఆ కుటుంబంపై విధి పగబట్టింది. కూతురి చదువు ఖర్చులు భరించలేని ఆ తల్లిదండ్రులు కేజీబీవీలో చేర్పించారు. ఇంత దారుణ పరిస్థితుల్లో ఉన్న వారిపై చిన్నారి ఆరోగ్యం సరిగ్గా లేదని వైద్యులు తెలపడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. ముస్తాబాద్‌కు సిందె రవి, శ్యామల దంపతులకు కూతురు శిరీష, ముగ్గురు కుమారులు. కులవృత్తి చేసే రవి, శ్యామల దంపతులకు ఉండేందుకు ఇల్లు లేదు. రోడ్డు పక్కన గుడిసె వేసుకుని కాలం వెల్లదీస్తున్నారు. కూతురును చదివించలేకనే స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో చేర్పించారు. పదో తరగతి చదువుతున్న శిరీష హఠాత్తుగా కడుపులో నొప్పితో బాధపడుతుంది. సిద్దిపేట, హైదరాబాద్ ఆస్పత్రుల్లో చూపించగా.. కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వైద్యులు తెలిపారు. చిన్నారి ఆపరేషన్‌కు రూ.2లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. రోజులు గడిపేందుకు ఇబ్బంది పడుతున్నా ఆ కుటుంబానికి శిరీష ఆపరేషన్‌కు రూ.2లక్షలు ఎలా తేవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. చదువులో శిరీషను కాపాడాలని ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. మానవతావాదులు స్పందించి ఆదుకోవాలని శిరీష తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ఆర్థిక సహాయం చేయాలనుకునే వారు..
ఫోన్‌పే 94409 14850లో చేయాలని కోరుతున్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న వెంకటాపూర్ వాసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ బైపాస్‌రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా వెలసిన అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ గౌతంరెడ్డికి సోమవారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ ఆదాయానికి గండి కొట్టేలా సిరిసిల్లకు చెందిన వ్యాపారులు భూదందాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమతులు పొందకుండా అమాయకులకు ప్లాట్లను అంటగడుతూ పంచాయతీ ఆదాయాన్ని కొల్లగొడుతున్నారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకుని గ్రామానికి న్యాయం చేయాలని వెంకటాపూర్ గ్రామస్తులు కోరారు.

స్థానిక అవసరాలకు ఇసుక కొరత రానీయొద్దు

- అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్



సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో స్థానిక అవసరాలకు, నిర్మాణ పనులకు ఇసుక కొరత లేకుండా చూడాలని రెవెన్యూ, మైనింగ్ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడారు. వేములవాడరూరల్ మండలం లింగంపల్లి–బొల్లారం మధ్య చెక్‌డ్యామ్ ముంపు ప్రాంతం నుంచి 36 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను పూడికతీత ద్వారా తీసి ట్రాక్టర్ల ద్వారా రవాణా చేయాలన్నారు. స్థానిక అవసరాలకు వేములవాడ తహసీల్దార్ వే బిల్లులు జారీ చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. వేములవాడ ఆర్డీవో మధుసూదన్, మైనింగ్ ఏడీ సైదులు, జిల్లా భూగర్భజలశాఖ అధికారి నర్సింహులు, మిషన్ భగీరథ ఈఈ జానకి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్‌ఎండీసీ పీవో శ్రీకాంత్, వేములవాడ రూరల్ తహసీల్దార్ సుజాత, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదులు పాల్గొన్నారు.

ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్



విద్యార్థినికి మెమెంటో అందిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల: ఓటర్ల నమోదు కోసం వచ్చిన ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనల మేరకు పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో మాట్లాడారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఓటరు గుర్తింపు కార్డులు జారీచేయాలన్నారు. ఓటర్ల సవరణలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలను రిటర్నింగ్ అధికారులు పరిశీలించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, వసతులపై నివేదిక ఇవ్వాలని సూచించారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు, మహిళలకు ప్రత్యేక మోడల్ పోలింగ్ కేంద్రాలు, వెబ్‌క్యాస్టింగ్ అంశాలను పరిశీలించాలన్నారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, జాయింట్ ప్రధాన అధికారి సర్ఫరాజ్ అహ్మద్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో మాట్లాడారు. ఎస్.ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, సీపీవో శ్రీనివాసాచారి, అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్, స్వీప్ అధికారి కె.నర్సింహులు, సీ విభాగం సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఎన్నికల విభాగం అధికారులు రఫీ, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెమెంటోలు

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రాధాన్యతపై నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులను కలెక్టర్ అనురాగ్ జయంతి అభినందించి, మెమెంటోలు అందించారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జి.వైశాలి, ప్రథమ స్థానం పొందగా.. ఆవునూర్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కోల సాత్విక రెండో స్థానం పొందారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బత్తుల వేదిత మూడో స్థానం పొందారు. వీరికి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందించి, అభినందనలు తెలిపారు.

అనుమతి లేని హాస్పిటల్స్ సీజ్ చేయండి



వినతిపత్రం ఇస్తున్న నాగరాజు

సిరిసిల్లటౌన్: జిల్లాలో అనుమతి లేకుండా నడుస్తున్న హాస్పిటల్స్ సీజ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి నాగరాజు కోరారు. ఈమేరకు సోమవారం జిల్లా వైద్యాధికారి ఆఫీస్‌లో వినతిపత్రం అందించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని, చాలా వాటికి అనుమతులు లేవన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో అధిక వసూళ్లను కట్టడి చేయాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మల్లేశం, నరేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా వేణు



అన్నల్‌దాస్ వేణు

సిరిసిల్లటౌన్: బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా సిరిసిల్లకు చెందిన అన్నల్‌దాస్ వేణు నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి బి.ఉమాశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్ గోకుల్ రామారావులకు ధన్యవాదాలు తెలిపారు.

లో లెవల్ వంతెనకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్



పనులు పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఏఈ సతీశ్

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి నుంచి కొదురుపాక వైపు వెళ్లే మార్గంలో ఉన్న లో లెవల్ వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. కల్వర్టు శిథిలమవడంతో పైపులు ఊడిపోయాయి. ఒక వైపు బుంగ పడింది. ఈ నేపథ్యంలో సాక్షిలో ఈనెల 16న ‘ప్రయాణం.. ప్రమాదం’, ఈనెల 18న ‘కల్వర్టుపై ప్రమాదకరంగా బుంగ’ శీర్షికలతో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు వంతెనకు తాత్కాలిక మరమతు పనులు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ ఈఈ సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ కల్వర్టు కింద భాగంలో ఊడిపోయిన పైపుల స్థానంలో మూడు భారీ పైపులు వేసి మరమ్మతు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బోయినపల్లి–కొదురుపాక మధ్య రాకపోకలు నిలిపివేశారు.

ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న మేకల కమలాకర్

సిరిసిల్లఅర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేకల కమలాకర్ విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అనేక హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మంజూరైన నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పవరిబాబు, చందు, రాజ్‌కుమార్, వినయ్, జోయల్, జగదీశ్ తదితరులు ఉన్నారు.

గణనాథుని కల్యాణం కమనీయం



ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని గూడెం ఉమామహేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సిద్ధి, బుద్ధి, వినాయక కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. స్వామి ఎదుర్కోళ్లు ఆకట్టుకున్నాయి. వేదపండితులు కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ చిట్నేని సరిత, ఉపసర్పంచ్ శాడ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్నేని అంజన్‌రావు, గిరి, వెంకటరమణ పాల్గొన్నారు.

కరాటేలో జిల్లా విద్యార్థుల ప్రతిభ



అభినందిస్తున్న సినీ నటుడు సుమన్



సర్టిఫికెట్లు అందిస్తున్న సినీనటుడు సుమన్

వేములవాడ: సుమన్ షాటోకాన్ కరాటే అఫ్ ఇండియా అకాడమీ నిర్వహించిన 21వ రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కుంగ్‌ఫూ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వేములవాడకు చెందిన 15 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్స్ బ్లాక్ బెల్ట్ విభాగంలో విగ్నేశ్, అర్ణవ్, లత గోల్డ్‌మెడల్స్, ప్రసన్య సిల్వర్ మెడల్స్ సాధించారు. బ్రౌన్‌బెల్ట్ విభాగంలో మహిత గోల్డ్, కలర్‌బెల్ట్స్ విభాగంలో సిద్ధాంత్, విశ్వతేజ, శరత్‌చంద్ర, సంజన, మన్విత గోల్డ్‌మెడల్స్ సాధించారు. కరాటే మాస్టర్ గగ్గురి దివ్య ఆధ్వర్యంలో వీరు శిక్షణ పొందారు. వీరిని గ్రాండ్ మాస్టర్ అమిత్, మాస్టర్లు శ్రీనివాస్, రాజనర్సు, ప్రసాద్, సురేశ్, విష్ణు అభినందించారు.

సిరిసిల్లకల్చరల్: హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఆదివారం జరిగిన జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో సిరిసిల్లకు చెందిన చిన్నారులు పతకాలు సాధించారు. వ్యక్తిగత వెపన్ విభాగంలో గెంట్యాల అద్వైత్, హ్యాండ్‌బేర్ అండర్–12లో చంద్రకిశోర్, నిశ్విక్, బోగ నరేశ్ స్వర్ణ పతకాలు సాధించారు. ప్రముఖ సినీహీరో సుమన్ చిన్నారులతోపాటు కోచ్ వడ్నాల శ్రీనివాస్‌ను అభినందించారు.

సర్పంచ్ వైఖరికి నిరసనగా వార్డు సభ్యుల రాజీనామా



రాజీనామాపత్రం అందిస్తున్న వార్డు సభ్యులు

చందుర్తి(వేములవాడ): మండలంలోని కట్టలింగంపేట సర్పంచ్ వైఖరిని నిరసిస్తూ ఆ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు రాజీనామా పత్రాలను చందుర్తి ఎంపీడీవో రవీందర్‌కు సోమవారం అందజేశారు. వార్డు సభ్యులు మాట్లాడుతూ సర్పంచ్ ఏనుగుల జమున ఏకపక్షంగా వ్యవహరిస్తూ, గ్రామ సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం రూ.10 లక్షల నజరానా, ఎమ్మెల్యే నిధుల ద్వారా రూ.15లక్షలు అందజేస్తామని ప్రకటించి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా నిధులు ఇవ్వకడం లేదన్నారు. గ్రామస్తులకు సమాధానం చెప్పలేకనే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. దువ్వ నాగవ్వ, బోడపట్ల కుంటవ్వ, దావ రమేశ్, అవారి మంజుల, యెల్ల విజయ, మల్లారపు రేఖ, మంజుల రాజీనామాపత్రాలు సమర్పించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



అంతిమయాత్రలో కూతురు

రుద్రంగి(వేములవాడ): కూతురే కొడుకై తండ్రికి తలకొరివి పెట్టిన సంఘటన రుద్రంగిలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన పీసరి భూమానందం(39)కు రెండేళ్ల క్రితం కిడ్నీ సంబంధిత వ్యాధి వచ్చింది. అప్పులు చేసి చికిత్స చేయించుకుంటున్నాడు. ఆదివారం రాత్రి చికిత్స తీసుకుంటున్న క్రమంలో పరిస్థితి విషమించి మృతిచెందాడు. కొడుకులు లేకపోవడంతో పెద్దకూతురు వైష్ణవి తలకొరివి పట్టింది. మృతుడికి భార్య లత, కూతుళ్లు వైష్ణవి(18), కీర్తన(13) ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో వారు రోడ్డున పడ్డారని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సిరికొండకు బస్సు నడపాలి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచులు

కోనరావుపేట(వేములవాడ): వేములవాడ నుంచి కోనరావుపేట మండలం మామిడిపల్లి, బావుసాయిపేట, వట్టిమల్ల, గొల్లపల్లి గ్రామాల మీదుగా నిజామాబాద్ జిల్లా సిరికొండ వరకు బస్సు నడపాలని కోరుతూ ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు వేములవాడ డీఎంకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన మేనేజర్ మంగళవారం నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచులు గోపు పర్శయ్య, ఉపసర్పంచులు చొక్కాల దేవరాజు, పుంగంగౌడ్ ఉన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయండి



వినతిపత్రం ఇస్తున్న సాధన కమిటీ సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ సాధన కమిటీ కన్వీనర్ ఒగ్గు బాలరాజు కలెక్టరేట్‌లో అధికారులకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాలను కలుపుతూ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. రాజబాబు, చంద్రమౌళి, పీర్యా, మల్లేశ్, చంద్రశేఖర్ ఉన్నారు.

మహిళను హత్య చేసిన కేసులో యావజ్జీవం

జగిత్యాలజోన్: అప్పు ఇచ్చిన మహిళను హత్య చేసిన కేసులో ముద్దాయికి యావజ్జీవ శిక్ష, రూ.4వేల జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి ఎస్.నారాయణ సోమవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాసారపు మల్లేశం కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బిరుదల హన్మక్కకు ఒకడే కుమారుడు. అదే గ్రామంలో హన్మక్క ఒక చోట, అతని కొడుకు మరోచోట నివసిస్తున్నారు. హన్మక్క అదే గ్రామస్తులతోపాటు చుట్టుపక్క గ్రామాలవారికి అవసరమంటే అప్పు ఇస్తుండేది. అయితే హన్మక్క 29 జూలై 2021న తన ఇంటి ముందున్న మురికి కాల్వలో చనిపోయి కనిపించింది. ఆమె ఇంట్లో ఉన్న ప్రామిసరీ నోట్లు, కొంత నగదు, ఒంటిపై ఉన్న బంగారపు గొలుసు, పడిగెలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆమె కొడుకు లక్ష్మణ్ తన తల్లిని అప్పు తీసుకున్న వ్యక్తులే చంపి మురికికాలువలో పడేశారని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ కృష్ణకుమార్ కేసును పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. వారి విచారణలో వెల్దుర్తికి చెందిన బొమ్మెన భూమరాజం అనే వ్యక్తి అప్పు తీసుకుని, తిరిగి చెల్లించాలని కోరినందుకే హన్మక్కను చంపినట్లు తేలింది. భూమరాజంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. అతనిపై చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు జి. కిరణ్‌కుమార్, జి.రామకృష్ణ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి బొమ్మెన భూమరాజంకు యావజ్జీవ శిక్షతోపాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్
WANTED
■ రామకృష్ణ గ్రూప్, VJA, HYD శ్రీమంతుల ఇళ్లలో వృద్ధుల సేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15 to 22 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 8639756219, 8639756226 [B-1060118]
www.sakshi.com
గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824